## ఆరోగ్య పరీక్షల పేరిట దోపిడీపై విచారణ జరిపించాలి




విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం గ్రేటర్ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్

ముషీరాబాద్, జూలై 8: భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్య పరీక్షల పేరిట జరుగుతున్న దోపిడీపై విచారణ జరిపించాలని సీపీఎం గ్రేటర్ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం గోల్కొండ క్రాస్ రోడ్‌లోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పరీక్షలు నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీఎస్‌సీ హెల్త్ కేర్ వెల్‌నెస్ సర్వీసెస్ సంస్థలకు కాంట్రాక్టు అప్పగించిందన్నారు. అడ్డగోలు లెక్కలు చూపిస్తూ వందల కోట్లు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.

## అందుబాటులో ఉంటాం..



ప్రజలకు అందుబాటులో ఉంటానని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, మల్లేపల్లి డివిజన్ల ప్రజలు కలిసి నీటి, డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై ఫిర్యాదులు చేశారు.

- మెహిదీపట్నం

# కొత్తరోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి




సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, జూలై 8 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ కుర్మబస్తీ, పోచమ్మబస్తీల్లో నూతన సీసీ రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. ముందుగా రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు పూర్తి చేయాలని చెప్పారు. డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, వివిధ ప్రభుత్వ అధికారులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే సోమవారం కుర్మబస్తీ, పోచమ్మబస్తీలో పాదయాత్ర నిర్వహించి ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బస్తీల్లో వాటర్ వర్క్స్ అధికారులు రోడ్డును తవ్వి పైపులైన్ పనులు చేపట్టి ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టకపోవడంతో గుంతలుగా మారిందన్నారు. ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఎమ్మెల్యే అక్కడే ఉన్న డీఈ ప్రవీణ్‌కు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని చెప్పారు. బోనాల పండుగకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, కొత్త ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. అలాగే కలుషిత నీరు లేకుండా స్వచ్ఛమైన నీరు ప్రజలకు సరఫరా చేయాలని అధికారులకు చెప్పారు. వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదని బస్తీవాసులు చెప్పడంతో అక్కడే ఉన్న ఏఈ సౌమ్యను ఎక్కడెక్కడ వెలగడం లేదో గమనించి మరమ్మతులు చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, సర్కిల్ మెడికల్ ఆఫీసర్ డా.హేమలత, డీఈ ప్రవీణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, వాటర్‌వర్క్స్ ఏఈ మాజిద్ తదితరులు పాల్గొన్నారు.



## బొట్టు శ్రీను తల్లిని పరామర్శించిన ఎమ్మెల్యే

బాగ్‌అంబర్‌పేట డివిజన్ పోచమ్మబస్తీకి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బొట్టు శ్రీను తల్లికి ఇటీవల యాక్సిడెంట్ అయింది. ఇంట్లో ఉంటూ చికిత్స పొందుతుంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సోమవారం అతని ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## టీజీఈఏపీసెట్-2024 ధ్రువీకరణ పత్రాల పరిశీలన

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో టీజీఈఏపీసెట్-2024 ప్రవేశాలకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొనసాగుతున్నది. సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాలలో కౌన్సిల్ కేంద్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ జే లక్ష్మణ్‌నాయక్ పర్యవేక్షించి విద్యార్థులకు వెరిఫికేషన్ సర్టిఫికేట్లను అందజేశారు. 13వ తేదీ వరకు పరిశీలన కొనసాగుతుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, హాస్టల్ వైస్ ప్రిన్సిపాల్ డి. వెంకట రమణ, కౌన్సిల్ కో - ఆర్డినేటర్ బి.రామయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలక్రిష్ణ పాల్గొన్నారు.

- సుల్తాన్‌బజార్



## 'కొన్ని ఊసులు ఇంకొన్ని ఊహలు'



'కొన్ని ఊసులు ఇంకొన్ని ఊహలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కె.వి.రమణాచారి, ఏనుగు నరసింహా రెడ్డి

రవీంద్రభారతి, జూలై 8 : తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ , కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సాహితీవేత్త డా.వోలేటి పార్వతీశం రచించిన 'కొన్ని ఊసులు ఇంకొన్ని ఊహలు' కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారుడు డాక్టర్ కె.వి. రమణాచారి, విశిష్ట అతిథిగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, నగ్నముని విచ్చేశారు. పుస్తకాన్ని ఆవిష్కరించి దూరదర్శన్ పూర్వ ప్రయోక్త ప్రేమామాన్వికి బహూకరించారు. సభకు ముందు గాయని సురేఖ మూర్తి, దివాకర్ల లలిత సంగీత విభావరి వీక్షకులను ఆకట్టుకున్నది. రచయిత్రి శైలజ మిత్ర, నగ్నముని, కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ కార్యదర్శి ముద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.




## అంగరంగ వైభవంగా.. తెలంగాణ బోనాల జాతర

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాలు ప్రతీక అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త అన్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ , ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో తెలంగాణ బోనాల జాతర ఉత్సవాల కార్యక్రమం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోలేటి దామోదర్‌గుప్త విచ్చేసి బోనాల జాతర ఉత్సవాన్ని ప్రారంభించారు. సభకు ముందు పలువురు విద్యార్థినులు బోనాలు, కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలిచ్చి వీక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు లయన్ కె.వి. రమణారావు, నాట్యగురువు ప్రసన్నరాణి, లలితరావు, టీవీ నటులు రాగిణి, కరాటే కల్యాణిను భారత్ ఆర్ట్స్ అకాడమీ సత్కరించింది.

- రవీంద్రభారతి



గోల్నాక డివిజన్ శంకర్‌నగర్‌లో డ్రైనేజీ మ్యాన్‌హోల్ కుంగి పోయి రహదారి దెబ్బతినడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ దూసరి లావణ్యగౌడ్ ఆదేశాలతో సోమవారం సమస్యను బీఆర్‌ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు.

- గోల్నాక



ఖైరతాబాద్ జడ్సీ అనురాగ్ జయంతిని గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్ కలిసి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులు, దోమల నివారణ, నూతన రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జోనల్ కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విపిన్ రమావత్ పాల్గొన్నారు.

- అబిడ్స్




## కేబినెట్ సదస్సు

మల్లికార్జుననగర్‌లోని రోజ్‌బడ్స్ పాఠశాలలో సోమవారం కేబినెట్ సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి హాజరై విద్యార్థులకు స్కూల్ ఫ్లాగ్, హౌజ్ ఫ్లాగ్, బ్యాడ్జీలు అందజేసి అభినందిస్తూ వారికి విధులను అప్పగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- అంబర్‌పేట

## పైపులైన్ పనులు పరిశీలన

ముషీరాబాద్ డివిజన్ ఫకీరువాడ – పద్మరావునగర్ మార్గంలో చేపడుతున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ ఎం.సుప్రియాగౌడ్ పరిశీలించారు. పనులు చేపడుతున్న తీరును వాకబు చేసిన ఆమె వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బీజేపీ నాయకుడు ఎం.నవీన్‌గౌడ్, సత్యనారాయణ, రమేవ, వెంకటేశ్, పద్మ పాల్గొన్నారు.

- ముషీరాబాద్



## అంబారిపై అమ్మవారి ఊరేగింపు



గోల్కొండ బోనాల తొలి బోనం రోజున మోహల్లాగంజ్ నుంచి కులవృత్తుల సంఘం అధ్యక్షులు బి.సాయిబాబాచారి నేతృత్వంలో యువనాయకుడు శ్రీకాంత్‌చారి చేసిన సందడి హైలెట్‌గా నిలిచింది. సొంత ఖర్చులతో ప్రతి ఏడాది ఊరేగింపును గోల్కొండ మోహల్లాగంజ్ నుంచి కోటపై ఉన్న జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయం వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీకాంత్ చారి తెలిపారు.

- మెహిదీపట్నం



## ఆకట్టుకున్న కనకదుర్గ నృత్య విభావరి

రవీంద్రభారతి, జూలై 8 : సాంస్కృతిక సంస్థ కనకదుర్గ నృత్యా విభావరి 42వ వార్షికోత్సవాన్ని నృత్య గురువు నిర్మలా ప్రభాకర్ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త, సాంస్కృతిక కళాబంధు సారిపల్లి కొండలరావు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు ఐశానిరావు, ఐశ్వర్య దేవత, సంహిత, సహస్ర , అక్షర, అనన్య, హర్షిణి, జయని, లత, రితిక, దిక్షిత, పూరివి, కృతిక, సతాక్షి ప్రదర్శించిన వినాయక స్తుతి, దశావతారం, అష్టపది, తిలాన అంశాలపై భరతనాట్య నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, ఆచార్య భట్టు రమేశ్, నాట్యగురువులు భాగవతుల సేతురామ్, అంజిబాబు పాల్గొన్నారు.

## మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా సాయికుమార్



పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న సాయికుమార్

అబిడ్స్, జూలై 8 : తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా మెట్టు సాయికుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ఎన్నికలకు ముందు చైర్మన్‌గా నియమించగా జీఓ విడుదల చేశారు. దీంతో ఆయన సాయంత్రం శాంతినగర్‌లోని మత్స్య భవన్‌లో మత్స్య శాఖ కమిషనర్ ప్రియాంక ఆల, మాజీ ఎంపీ వి. హనుమంతరావు సమక్షంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పదవీ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తనను సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించి రాష్ట్ర స్థాయి చైర్మన్‌గా నియమించారని సంతోషం వ్యక్తం చేశారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించేందుకు పాటు పడ్తానని తెలిపారు. తనకు చైర్మన్ పదవి ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు బోయిగూడకమాన్‌లోని తన నివాసంలో తల్లి ఆశీర్వాదం తీసుకుని అనుచరులతో ఊరేగింపుగా శాంతినగర్‌లోని మత్స్య భవన్‌కు చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మహ్మద్ ఫెరోజ్‌ఖాన్, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్, పార్టీ నాయకులు గంగ పుత్రులు తరలి వచ్చి మెట్టు సాయికుమార్‌కు అభినందనలు తెలిపారు.

## కాచిగూడ ఇన్‌స్పెక్టర్‌గా చంద్రకుమార్



కాచిగూడ, జూలై 8: సౌత్‌జోన్‌లోని స్పెషల్ బ్రాంచ్ విభాగంలో పని చేసిన 1996 బ్యాచ్‌కు చెందిన కె.చంద్రకుమార్ కాచిగూడ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. నగర కమిషనర్ ఉత్తర్వులు జారీచేయడంతో కాచిగూడ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.



ఓయూ నుంచి జర్నలిజంలో డాక్టరేట్ పొందిన బాగ్ అంబర్‌పేట తురాబ్‌నగర్‌కు చెందిన కొండేరు రాకేశ్ వంజరిని సోమవారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సన్మానించి అభినందించారు. బీజేపీ నాయకుడు ఏడెల్లి అజయ్ కుమార్ ఉన్నాడు. - గోల్నాక

## ఏఐసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా గిడియన్ బాబు



చిక్కడపల్లి, జూలై 8 : ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ గిడియన్ బాబు నియమితులయ్యారు. సోమవారం జరిగిన రాష్ట్ర సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు హాజరై నూతన కమిటీని నియమించారు. నూతన అధ్యక్షుడిగా డాక్టర్ గిడియన్ బాబు, ప్రధాన కార్యదర్శిగా బిషప్ డాక్టర్ జి.శామ్యూల్ జాన్, కోశాధికారి పి.సోలమన్ రాజ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా డాక్టర్ ఎస్. అబ్రహం, ఉపాధ్యక్షులుగా ఎన్.ప్రదీప్, ఎం.ఎస్.దయానంద్, దేవసహాయం, రాష్ట్ర డిప్యూటీ సెక్రటరిగా వనితా అలెగ్జాండర్ నియమితులయ్యారు.

## అరెస్టులు..నిర్బంధంతో సమస్యలు పరిష్కారం కావు

డీఎస్సీ వాయిదా వేయాలని డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయ ముట్టడికి యత్నించిన అభ్యర్థుల అరెస్టును పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేశ్ ఖండించారు. అరెస్టులు, నిర్బంధంతో సమస్యలు పరిష్కారం కావని ప్రభుత్వం గుర్తించాలన్నారు. పోటీ పరీక్షలకు సమయం ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారని, వారి న్యాయమైన డిమాండ్‌లను పరిగణలోకి తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేరుగా డీఎస్సీ అభ్యర్థులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# కరోనా సమయంలో వైద్యుల సేవలు ఎనలేనివి




పీడియాట్రిషన్ మంతటి వినయ్‌కుమార్‌ను వైద్యరత్న అవార్డుతో సత్కరిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం

సుల్తాన్‌బజార్, జూలై 8 : జియాగూడకు చెందిన పీడియాట్రిషన్ డాక్టర్ వినయ్ కుమార్‌ను వైద్యరత్న అవార్డు వరించింది. రవీంద్రభారతిలో మదర్ ఫౌండేషన్ నిర్వహించిన జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్య అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి,బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ఏపీ ప్రభుత్వ మాజీ ఛీఫ్ విప్ రుద్రరాజు పద్మరాజుతో కలిసి డాక్టర్ వినయ్‌కుమార్, పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రణీత దంపతులకు వైద్యరత్న అవార్డును ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో మదర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నెకపల్లి మల్లికార్జున్‌రావు, కార్యనిర్వాహణ కార్యదర్శులు రాఘవ, సాయినాథ్, ఆర్. సాయికుమార్, బీఆర్‌ఎస్ నాయకుడు మంతటి నర్సింహులు, ఎం. విజయలక్ష్మి, మంతటి ధృవిక, పి. జయప్రకాశ్, పి.జయశ్రీ పాల్గొన్నారు.

# మూడు సబ్ స్టేషన్ల ఏర్పాటుకు కసరత్తు

- స్థలాలు గుర్తించిన అధికారులు
- కేటాయించాలని కలెక్టర్‌కు వినతి

మెహిదీపట్నం, జూలై 8: ప్రజలకు విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా చేయడానికి కార్వాన్ నియోజకవర్గంలో ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌డివిజన్ అధికారులు మూడు నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌తో చర్చించి స్థలాలను కూడా గుర్తించారు. ఆయా స్థలాలను విద్యుత్ శాఖకు కేటాయించాలని ఎమ్మెల్యే ద్వారా రూపొందించిన ప్రతిపాదనలతో పాటు శనివారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు విద్యుత్ శాఖ ఆసిఫ్‌నగర్ డీఈ శ్యాంసుందర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. స్థలం కేటాయింపులు జరిగిన వెంటనే ఉన్నతాధికారుల నుంచి సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు అనుమతులు పొంది పనులను ప్రారంభిస్తామని డీఈ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. టోలిచౌకి సెవన్ టూంబ్స్ రోడ్డులో 2 వేల గజాల ప్రభుత్వ స్థలాన్ని, ఎండీలైన్స్ శాతం చెరువు వద్ద స్థలాన్ని, టోలిచౌకిమెరాజ్ కాలనీలో నుంచి వెళ్లే గండిపేట్ కాండూట్ కాలువ వద్ద సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన చెప్పారు.



టోలిచౌకి ఎండీలైన్స్ శాతం చెరువు పక్కన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు గుర్తించిన స్థలం

## విద్యుత్ డిమాండ్ తగ్గట్టు సబ్ స్టేషన్ల నిర్మాణం

గోల్కొండ, టోలిచౌకి, నానల్‌నగర్, లంగర్‌హౌస్ పరిసర ప్రాంతాలలో నివాస స్థలాలు పెరిగి కరెంట్ డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టడమే పరిష్కారం. - శ్యాంసుందర్‌రెడ్డి, డీఈ





కీసరగుట్ట శ్రీ భవానీరామలింగేశ్వరస్వామి పల్లకీసేవ ఊరేగింపును సోమ వారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. కీసరగుట్ట గర్భాలయంలో స్వామివారికి తేనే, ఆవుపాలు, పంచామృతంతో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగలింగంశర్మ, కార్యనిర్వహణాధికారి సుధాకర్ రెడ్డి,భక్తులు పాల్గొన్నారు.

- కీసర

## బిల్లులు వెంటనే చెల్లించాలి



ఆందోళన చేస్తున్న తెలంగాణ 4 వీలర్ అసోసియేషన్ నాయకులు, డ్రైవర్లు

సుల్తాన్‌బజార్, జూలై 8: పదహారు నెల్లుగా పెండింగ్‌లో ఉన్న డ్రైవర్ల వేతనాలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ 4 వీలర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాంపల్లిలోని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలో అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. డ్రైవర్లకు ఇచ్చే రూ. 34 వేల వేతనం సరిపోవడం లేదని రూ. 55 వేలకు పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న డ్రైవర్లను కమర్షియల్ ట్యాక్స్ అధికారులు సముదాయించడంతో నిరసన విరమించారు.

## ఫుట్‌పాత్‌పై వ్యక్తి మృతి

కాచిగూడ,జూలై 8: ఫుట్‌పాత్‌పై వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ అడ్మిన్ ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (45)కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని పోస్టాఫీస్ ఫుట్‌పాత్‌పై అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడి ఒంటిపై గోధుమ రంగు చొక్కా, నలుపు ప్యాంట్ ధరించి ఎత్తు 5.4 ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 8712660542లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి..

దవాఖానలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కటేదాన్‌కు చెందిన బేడంగి అరుణ్(33) పెయింటర్. గత నెల 24వ తేదీన శివరాంపల్లి-బుద్వేల్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాడుతుండగా రైలు ఢీకొనడంతో రైల్వే పోలీసులు ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.